'సిలికానాంధ్ర-రచన' సంయుక్తంగా నిర్వహించిన
కథల పోటీలో ప్రథమ బహుమతి పొందిన కథ


- సుజనరంజని - ప్రత్యేకసంచిక - 2005
- రచన. ఇంటింటిపత్రిక. ఫిబ్రవరి 2006


# తెరువు

మెట్ల మీద చప్పుడౌతోంది. ఒక్కక్షణం చెవులు రిక్కించింది వసుంధర. అంతకు ముందయితే ఆమె అంతగా ఆ చప్పుళ్ళని పట్టించుకలేదుగాని గత కొద్ది రోజులుగా పరిశీలిస్తూనే ఉంది - ఆ మెట్లు దిగుతున్నది అతగాడే. కాస్త యీడుస్తున్న ఓపెన్ లెదర్ జోళ్ళు, వాటికి తోడు చేతికఱ్ఱ చప్పుడూ, లిఫ్ట్ ఉన్నా అతను వాక్‌కి దిగే సమయంలో వాటకు.

అతను పూర్తిగా మెట్లు దిగిపోవడం ఆమె అలవోకగా కిటికీలోంచి చూడనే చూసింది. ఆ సమయంలో అతగాడూ ఇటే చూశాడు. మనిషికి ఎనభై ఏళ్ళపైనే ఉంటుంది వయస్సు. పేరేంటో తెలీదు. ఏం చేస్తాడో తెలీదు. కానీ ఒంటరిగా ఉంటాడని మాత్రం తెల్సుకుంది.

అతను వీధిలోకి వెళ్ళబోయిన వాడల్లా వెనుక్కు తిరిగి రెండడుగులు వేసి గుమ్మం దగ్గర ఆగేడు. సాధారణంగా ఆ వీధి తలుపు ఎప్పుడూ మూసే ఉంచుతుంది వసుంధర. కానీ ఈ రోజు సాయంకాలపు చల్లగాలి కోసం తెరిచి ఉంచింది. తను చేసిందానికి అతను ఏదో ఒకటి తనను అంటాడనే నాలుగు రోజులుగా అనుకుంటోంది. ఈ రోజు తలుపు తెరిచి ఉంది – ఎదురుగా తనూ ఉంది.

"వసుంధరంటే మీరేగా?" అంటూ ప్రశ్నించి, సమాధానం కోసం ఆగకుండా, "మంగ వెళ్ళిపోయింది వాళ్ళింటికి– ఇప్పుడు మీ కళ్ళు చల్లబడ్డట్టే గదా. పోలీసు కేసు అవకుండా మీ దయవల్ల తప్పించుకోగలిగేనులెండి! అయినా నేనేం నేరం చేశాననీ? సంస్కరణ అన్నది అన్ని కోణాల్లోంచీ రావాలి. అది అందరూ ఆహ్వానించదగ్గదే – అయితే అండర్ గ్రౌండ్ సమాజంలో ఎంతమంది పసివాళ్ళు పనిచేస్తూ తమ బాల్యాన్ని పోగొట్టుకుంటున్నారో మీకు తెలీదా? వంటి మీద ఒకే ఒక్క చింకి నిక్కరుండీ సారా సీసాల్నీ, బ్రాందీ బాటిళ్ళనీ, టీ గ్లాసుల్నీ అదించే కుర్రవాళ్ళ మీద వెకిలి, బూతు జోకులు వేయగల సమాజం మనది. పెంచలేక ఆడశిశువును నిర్దాక్షిణ్యంగా అరబ్బులకు అమ్ముకునే జాతి మనది. వాళ్ళందరూ మీ కళ్ళకి కన్పించరా? బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలనుకుంటే ముందు నేనే కన్పించానా మీ వంటి సంస్కారులకీ, జాలిపరులకీ?"

వసుంధర అతని వంకే రెప్ప వాల్చకుండా చూస్తోంది. అతను కోపంతో ముఖం ఎర్రబడగా ఆవేశంతో ఊగిపోతున్నాడు. ఈ పరిస్థితిలో తనేం మాట్లాడినా అతను రెచ్చిపోయే ప్రమాదముంది.

"స్త్రీలకీ, యువతకీ అందరికీ హక్కులున్నాయి, ఈ దేశంలో – వాటిని వారు పరిరక్షించుకునే దిశలో ఏమైనా చేయగలరు. ఏ హక్కులూ లేనిది మా వంటి వృద్ధులకే కదా. నాకు ఎనభై నాలుగేళ్ళు. మీకు తెలుసో లేదో. – ఈ రోజుకి కూడా నా పనులు నేను చేసుకుంటాను. అయితే మనిషి సాయమన్నది ఎవరికైనా కావల్సిందే. అంత మాత్రాన...? నూటికి తొంభై మంది ఇల్లాళ్ళకు పనిమనుషులు కావాలి. అంట్లు తోమడానికో... గదులూడ్చుడానికో... గుమ్మాలు కడిగి ముగ్గులు వేయడానికో. మన పని మనం చేసుకోలేక పోవడమనేది మనందరికీ ఉంది. ఎవరో వచ్చి మన పని చెయ్యాలి. అది ముసలిదైనా, గర్భిణీ స్త్రీ అయినా, పదహారేళ్ళ పిల్లయినా, పదేళ్ళు కూడ నిండని పిల్లయినా సరే! తరతరాలుగా మనిషి మనిషికి దాస్యం చేయడం."

అతనక్కడ ఖాళీగా ఉన్న కుర్చీ మీద కూర్చోబోయి నిలదొక్కుకుని నిల్చున్నాడు.

వసుంధర బొమ్మలా నిలబడి విన్నదే గాని మారు మాట మాట్లాడ్డానికీ, జవాబు చెప్పడానికీ సాహసించలేదు.

మరికాస్సేపు అదే ఆవేశంతో ఉక్కిరిబిక్కిరై తను చెప్పాల్సిన వేవో ఇంకా ఉన్నట్టు మధ్యలోనే ఆపేసి, వెనుదిరిగి వెళ్ళిపోయాడు.

అతను వెళ్లిపోయిన కాస్సేపటికి వసుంధర లోపలికొచ్చి టీ కలుపుకుని తాగింది. ఆలోచిస్తే ఆ ముసలాయన చెప్పిన వాటిలో కొన్ని నిజాలు లేకపోలేదనిపించింది. అయితే తను చేసిందీ తప్పు కాదు-పట్టుమని పదేళ్లుంటాయేమో, ఆ పిల్లకి. మొదటిసారి లిఫ్టులో చూసింది. ఆ పిల్ల చేతిలో ఓ సంచీ, సంచీ నిండా ఏవేవో సరుకులు. మరోసారి ఓ వర్షం రోజు ఉదయం తొమ్మిది గంటలకు తలుపు కొడితే చూసింది. “అయ్యగారికి పేపరు రాలేదివాళ. మీ పేపరొకమారు ఇమ్మన్నారు” అంది, అప్పుడు చూసింది పరీక్షగా దాన్ని. వెనక్కు నున్నగా దువ్విన జుట్టుకు రిబ్బన్ కట్టుకుంది. మెరూన్ రంగు పొడవాటి గౌను వేసుకుంది. శుచిగా, శుభ్రంగా ఉంది.

“నువ్వు వాళ్ళింట్లో పనిచేస్తావా?” అన్న ప్రశ్నకు అవునన్నట్లు తలూపింది. తెలుగు పేపరు ఇచ్చి పంపితే అరగంటలో తెచ్చి ఇచ్చేసింది.

“ఎక్కడుంటారు మీరు?” అడిగింది -

“ఆరిపాకలో” అంటూ మరోమాటకు అవకాశమివ్వకుండా వెళ్ళిపోయింది. ఎందుకో... దాన్ని తల్చుకుంటే జాలనిపించింది వసుంధరకి. చుట్టుప్రక్కల పల్లెలోని ఇటువంటి బీద పిల్లల్ని చూసి వాళ్ళ తల్లిదండ్రులకు ఎన్నో ఆశలు కల్పించి ఎంతో కొంత సొమ్ము ముట్టజెప్పి ఇరవై నాలుగు గంటలూ తమ ఇంట్లో ఉండి తమ పనులు చేసి పెట్టేందుకు తెచ్చుకుంటారు. డబ్బూ ఇచ్చి తిండీ బట్టా ఇస్తున్నామనే అనుకుంటారు తప్ప మరోలా ఆలోచించరు.

ఈ ఫ్లాట్‌లోకి రాక పూర్వం వసుంధర వేరే చోట రెండు గదుల ఇంట్లో ఉండేది. ఆ ఇంటి ప్రక్క అపార్ట్‌మెంట్ దిగువ భాగంలో మోటారు విడిభాగాలతో వ్యాపారం చేసే ఒక కుటుంబం ఉండేది. వాళ్ళింట్లో చిన్నా పెద్దా కలిపి వున్నది ఐదుగురే అయినా నిరంతరం ఇంట్లో ఉండేందుకు ఒక పనిపిల్ల ఉండేది. పేరు శాంతి. వయసు ఎనిమిదికి మించదు. తెల్లార్లేచి గదులూ వాకిళ్ళూ ఊడ్చడం; పాలూ కూరగాయలూ తేవడం; బట్టలుతదకం, పిల్లల్ని ఆడించడం; వాళ్ళ వెనుక పుస్తకాల సంచీ మోసుకుని బడికి దింపడం; యజమానురాలికి వంటింటి పనుల్లో సాయం చేయడం... ఇలా చాలా పన్లే చేసేది శాంతి. అయినా దానికి తిట్లూ దెబ్బలూ తప్పేవి కాదు. వసుంధర ముందు గది కిటికీలోంచి ఆ ఇంటి పెరడు కన్పించేది. బట్టలుసరిగా ఉతకలేదనో, బాగా అరెయ్యలేదనో తరచు ఆ పిల్లను కొట్టేదాయింటి యజమానురాలు. ఆవిడ అన్నగారికి పోలీస్ డిపార్ట్‌మెంట్లో పని. దెబ్బలకు భయపడో, పని చెయ్యలేకో ఆ పనిపిల్ల నెలకో మారు పారిపోయే ప్రయత్నం చేసి

దొరికిపోయేది. మరిన్ని దెబ్బలు తినేది– "మరోమారు ఇలా జరిగితే జైల్లో పడేయిస్తాను." అనేదావిడ. అక్కడివారంతా ఆ హింసను టీవీల్లో సీరియల్ చూసినట్లు చూసేవారు గాని మాట్లాడేవారు కాదు. అక్కడి పరిస్థితి వింతగానూ, హృదయవిదారకంగానూ అన్పించేది వసుంధరకి.

ఎవరో ఒకరు కల్పించుకుంటేనే గాని పరిస్థితి బాగుపడదనిపించింది. చివరికి– ఎవరికి రిపోర్టు చెయ్యాలో వారికి తెలియపరచింది. శాంతిని చెరలోంచి విడిపించింది.

వీధి మారి, ఇల్లు మారినా, ఇక్కడా అదే సమస్య. విషాదకర పరిస్థితి లేకపోయినా సమస్య అదే అన్పించింది.

మనదేశ జనాభా ఎక్కువ. పేదరికం ఎక్కువ. చదువురాని వారూ ఎక్కువే. అంత మాత్రాన ముక్కుపచ్చలారని పిల్లలచేత పెద్దలకు కూడ కష్టసాధ్యమైన పన్లు చేయించడం ఎంతవరకూ సమంజసం?

అలికిడైతే గుమ్మం వంక చూసింది వసుంధర.

మళ్ళీ అతగాడే! చేతిలో పాలిథిన్ కవర్లో బ్రెడ్డూ, పళ్ళూ ఉన్నాయి.

"మీరు పేపరాఫీసులో పనిచేస్తారటగా" అడిగేడు.

అసంకల్పితంగా ఔనన్నట్లు తలూపింది.

"మంచిదే. చైతన్యం, సామాజిక స్పృహ వంటి పదాలకు అర్థాలు తెలిసుంటాయి. నా మనవరాలి వయసుంది నీకు. ఆచరణకు సాధ్యమైనా కొన్ని చోట్ల ఆవేశం పనికిరాదు – పరిస్థితులూ, వాటి మూలాలూ కాస్త ఆలోచించాలి" అన్నాడు.

ఏవిటి ఇంకా ఆలోచించేది? ఎంత డబ్బు ఇస్తున్నా పసిపిల్లను తల్లిదండ్రులకు దూరం చేసి ఇంటిపనంతా ఇరవై నాలుగ్గంటలూ చేయించుకోడం అమానుషం, అక్రమం కాదూ?

అప్పటికే ఆయన అక్కడ్నించి వెళ్ళిపోయాడు.

మంచి చెడు; పాపం పుణ్యం వంటి ఆలోచనలు తనకే ఎందుకొస్తాయో, ఇతరులకెందుకు రావో, వచ్చినా వారు వాటిని చూసీ చూడనట్లు, తమకు పట్టని ప్రపంచ విషయాలన్నట్లు ఎలా మెలుగుతారో అర్థం కాలేదామెకు. వ్యక్తిగా సాధించలేనిది మూకగా సాధించవచ్చంటారు. ఒక్కొక్కప్పుడు చట్టం వల్ల సాధ్యం కానిది కూడా పట్టుదల, కృషి, అంకితభావం ఉన్న ఒక వ్యక్తి సాధించవచ్చు.

భారతదేశంలో బాలకార్మిక సమస్య చాలా తీవ్రంగా ఉందనీ, బాలలను శ్రమ దోపిడీ నుంచి విముక్తి చేయాలనీ రోజూ ఏదో మూల పేపర్లలో ప్రకటనలు వస్తూనే ఉన్నాయి. పన్నెండేళ్ళు కూడ నిండని పసిపిల్లల చేత జీతాన్ని ఎరజూపి పనులు

చేయించకూడదనీ, అది నేరమనీ, అలా చేయించుకునే వారిని శిక్షిస్తామనీ స్థానిక ప్రభుత్వాలు కూడ ప్రచార మాధ్యమాల్లో ప్రకటనలను గుప్పిస్తున్నాయి. అయినప్పటికీ సమస్య రోజురోజుకీ విస్తృతమౌతూనే ఉంది. అందుకు కన్పించే కారణాలు రెండే - పేదరికమూ, విద్యావ్యవస్థ వైఫల్యమూ. బడికి వెళ్ళే వయసులో పనికి వెళ్ళడం ఎంతటి దురదృష్టకరం!

ఎక్కడో చదివింది- అగ్గిపెట్టెలు, తివాచీలు, బీడీలు, గాజులు, బాణాసంచా, క్వారీ, చేనేత పరిశ్రమ- ఈ ఫ్యాక్టరీల్లో బాలకార్మికులే ఎక్కువట- కొన్ని చోట్ల వారు వేతనమే లేకుండా చేస్తున్నారంటే ఆశ్చర్యమే!

వారం రోజుల తర్వాత పనిమనిషి భూలోక చెప్పింది. తను అతగాని ఇంట్లో కూడా పనికి కుదురుకున్నట్లు. భూలోకకి ఏభై ఏళ్ళుంటాయి. పుట్టి పెరిగింది పల్లెలోనే అయినా పట్నవాసాల ఇళ్ళల్లో పనులు చేయడానికి అలవాటు పడింది.

"ఆయనగారికి రోజంతా ఉండిపోయి పనిచేసే మనిషి కావలి కాబోలు... నువ్వు చేయగలవా?" అడిగింది.

"అబ్బే. నాల్రోజుల కాణ్ణించి చేస్తన్నాను గదా. పనట్టే ఉండదు. రెండు పూటలా కలిపి కాసిన్ని 'గిన్నెలూ, పళ్ళాలూ, టీ కప్పులూ- అంతే. గదులూడ్చి రోజూ తడిబట్ట పెట్టాల. జీతం కాడ బేరం లేదు. అందరూ ఎంతిస్తే అంతే ఇస్తానన్నారు" అందది.

వసుంధరేం మాట్లాడలేదు- ఈ మాత్రం దానికే ఆ పనిపిల్లని రోజంతా ఉంచుకుని చాకిరీ చేయించడమెందుకో- అని అన్పించింది.

◆ ❖ ◆

ఆ రోజు ఉదయం అతనొక్కడే మార్నింగ్ వాక్ నుంచి కాబోలు రావడం చూసింది వసుంధర. చేతిలో కూరగాయలూ, బ్రెడ్డూ ఉన్న కేరీ బేగ్ ఉంది.

"పొద్దుటేల రొట్టీ పాలు, మద్దినేల భోజనం... అదీ ఏటనుకున్నారు... ఒక కూర, చారూ, పెరగూ అంతే. అతగాడే ఒండుకుంటాడు. రాత్తిళ్ళు సెపాతీ, పప్పు, పగటి పూట అరారా టీయో, కాఫీయో ఉండాల. ఏమాటకామాటే సెప్పుకోవాలి. ఆ టయంకి ఎవురుంటే ఆళ్ళకీ ఆయన్తో పాటే- పెట్టేకాడ మా దొడ్డసెయ్యిబాబుది-" నాల్రోజులనాడు పనిమనిషి తనతో చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి వసుంధరకు. శ్రోతలా విన్నదే తప్ప మరో ప్రశ్న వేయలేదు... ఇంటి విషయాలు సేకరించి మరొకరికి చేరవేయడంలో పనిమనుషులు ఒక్కోప్పుడు ప్రధాన పాత్రనే వహిస్తారు.

ఎవరి కుటుంబ సమస్యలు... ఎవరి అలవాట్లు... ఎవరి జీవిత విధానాలు వారివి. వేరొకరివి పోలి ఉండాలని ఏం వుంది? మనకెందుకులే అనుకున్నా కొందరి గురించి కొన్ని కొన్ని విషయాలు చెవిన పడుతూనే ఉంటాయి. ఆ విధంగానే అతగాని నుంచి కొన్ని వివరాలు వసుంధరకు అందేయి- పేరేదో ఉందిగాని అంతా ఆయనను రావుగారనే

అంటారు. ఎనభై నాలుగేళ్ల వంటరి. ఇద్దరు కొడుకులూ, కూతురూ పై దేశాల్లో ఉద్యోగాలు చేసుకుంటూ పెళ్ళిళ్ళయ్యాక ఆ దేశాల పౌరసత్వాన్నే పొంది అక్కడే స్థిరపడిపోయారు. ఈయనొక్కడూ ఇక్కడ. మాతృదేశం మీద అంత ప్రేమెందుకో అన్పించకపోలేదు వసుంధరకు. తన పనే తాను చేసుకోలేని వయసులో పిల్లల దగ్గరుండక ఈ వంటరి బ్రతుకు ఎందుకు?

రిపోర్టిచ్చి మంగను తను అతని వద్ద పనిచేయకుండా చేసినందుకు అతనికి తన మీద కచ్చ, కోపం. అది సహజమే. జీవిత చరమాంకంలో ఒంటరి బ్రతుకు దుర్భరమే. పనులు చేసుకోవడానికి శరీరం సహకరించదు. మాటలు కలబోసుకోవడానికీ, మనసులోని ఆలోచనలు పంచుకోవడానికీ తనదనుకున్న తోడు ఉండదు. ఆరోగ్యం క్షీణించి మనిషి అవసరం ఏర్పడినపుడు కూడ అదే పరిస్థితి. ఆలోచించిన కొద్దీ రావుగారు ఇక్కడే ఉండే కంటె పిల్లల దగ్గర ఉంటేనే మేలనిపించింది.

వసుంధరకు తన తల్లి గుర్తుకొచ్చింది. స్వంత ఊరినీ, స్వంత ఇంటినీ వదిలి రాలేని ఆమెను ఏం చెప్పి తీసుకురా గలిగింది?

ఉద్యోగరీత్యా రావడం వల్ల తను ఇక్కడ వంటరిది. ఊరంతా తనదే అనుకున్నా తల్లి అక్కడ ఒంటరిది.

"నీకా మూడు ముళ్ళూ పడ్డాయంటే..."అంటూ ఉంటుంది.

అదే ఆమె కల, ఆశ కూడ!

◆ ❖ ◆

ఆ రోజు ఆఫీసు నుండి నడిచి వస్తోంది వసుంధర. ప్రతిపక్షాలకు చెందిన కార్యకర్తను అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యే హత్య చేయించాడన్న ఆరోపణతో ప్రతిపక్షం వారు రాస్తారోకోలు చేయిస్తున్నారు. కాస్త దూరం నడిస్తే ఏదో ఒక వాహనం దొరక్కపోదని నడుస్తున్న వసుంధరకు తన పాత స్నేహితురాలు జలజాక్షి ఇల్లు అక్కడకు దగ్గరే అన్న విషయం గుర్తుకొచ్చింది- కాస్సేపు కూర్చొని పోవచ్చని అటుపక్క తిరిగింది-

వసుంధర వెళ్ళేసరికి జలజాక్షి ఎవరో వృద్ధదంపతులతో మాట్లాడుతోంది. తనను చూసి ఆశ్చర్యాన్ని అభినయించి కూర్చోమని సైగచేసింది.

"మేరేజెస్ ఆర్ మేడిన్ హెవెన్ అన్నారు సరే. భూమ్మీద మాత్రం మీ వంటి వారే సాయపడుతున్నారు. మీ ఋణం తీర్చుకోలేనిది" అంటున్నాడు ఆమెకు ఎదురుగా కూర్చున్నతను. అతనికి డెబ్బయి పైనే ఉంటుంది వయసు.

జలజాక్షి నవ్వుతోంది – అటువంటి పొగడ్తలంటే ఆమెకు ఇష్టం.

"మీరు మా ఊరొచ్చి మా అతిథ్యాన్ని తప్పకుండా స్వీకరించాలి" అంటోందామె. ఆమెకు నిండా అరవై ఏళ్ళుంటాయి. ఆమె ఏదో గిఫ్ట్ పేక్‌ని జలజాక్షి చేతి కందించింది.

"మీ అభిమానం ఉంటే అంతే చాలు. ఎప్పుడో అప్పుడు తప్పకుండా వస్తాను"

అంది జలజాక్షి.

వాళ్ళు లేచి వేళ్ళేక జలజాక్షి కెదురుగా వెళ్లి కూర్చుంది వసుంధర.

ఇంటర్లో ఇద్దరూ కలిసి చదువుకున్నారు. పెళ్ళయ్యాక జలజాక్షి సమాజసేవంటూ ఒక మేరేజ్‌బ్యూరో నడుపుతోంది.

"పొగడ్తల వల్లనో ఏమో నువ్వు కాస్త లావయ్యావు సుమీ" అంది వసుంధర నవ్వుతూ.

జలజాక్షి ఏం మాట్లాడలేదు.

"పెళ్ళి సంబంధం కుదిర్చింది వాళ్ళమ్మాయికా అబ్బాయికా?" అడిగింది వసుంధరే.

జలజాక్షి పడిపడి నవ్వింది.

"సూక్ష్మగ్రాహివి గదా. మా బాగా గెస్ చేశావులే" అంది ఆ తర్వాత.

"ఏం? కాదా?"

"కాదు. కుదిర్చింది వీళ్ళిద్దరికే. కలిపిందీ వీళ్ళిద్దరినే" అంది.

"ఈ వయసులోనా" ఆశ్చర్యపోయింది వసుంధర.

"ఏం కూడదా? ఆరేళ్ళ క్రితం భార్యపోతే ఒంటరి పక్షి అయ్యాడతను. కొడుకుల్లేరు. ఉన్న ఒక్క కూతురూ పెళ్ళయ్యాక దూరంగా ఉంది. లంకంత ఇంట్లో దుర్భర జీవితం గడుపుతున్నాడు. ఇక – ఆమె సంగతి కొస్తే – చిన్నతనంలోనే తల్లిదండ్రులు పోతే అన్నగారి దగ్గర జీవితం గడిపింది. కారణాలేమైతేనేం పెళ్ళికాలేదు. అన్నగారు పోయాక ఆ కుటుంబానికి దూరమై ఎవరిళ్ళలోనో వంటలు చేసుకుంటూ బతుకుతోంది. ఇద్దరూ తోడు కోసం నా బ్యూరోలో రిజిష్టరు చేసుకున్నారు. నేను చేసింది స్వల్పం. ఒకరి గురించి ఒకరికి చెప్పాను. ఇద్దరూ ఇష్టపడ్డారు. ఒక చూరు కింద బతుకుతున్నారు" అంది నవ్వుతూ.

వసుంధరకెందుకో ఆ క్షణంలో తన మేడ మీద వున్న అతగాడు గుర్తుకొచ్చాడు.

"మా పై పోర్షన్‌లో ఇలాంటి ఆయనే ఓ ఒంటరి మనిషి ఉన్నాడు. ఆయనకు తోడు కుదర్చగలవేమో చూడు" అంది.

స్నేహితురాళ్ళిద్దరూ కాస్సేపు సరదాగా కబుర్లు చెప్పుకున్నారు.

◆ ❖ ◆

రాత్రి డ్యూటీ చేసి లేటుగా వచ్చిందేమో, లేచేసరికి తొమ్మిదైంది. ఆకాశం మేఘావృతమై ఉంది. ఇంకా తెల్లారినట్టే అనిపించలేదు వసుంధరకి. తాపీగా బ్రష్ చేసుకుని ఫిల్టర్ కాఫీని కప్పులో పోసుకుని సిప్ చేస్తూ కూర్చొని కిటికీలోంచి బయటకు చూసింది. తుంపర తుంపరలుగా వానజల్లు. గాలి మంద్రంగా వీస్తోంది. మెట్ల మీంచి ఎవరో ఒకరిద్దరు

చెప్పులు టకటకా చప్పుడు చేసుకుంటూ దిగి వెళ్ళేరు. కాస్సేపటికి మరెవరో ఒకరిద్దరు వచ్చి కంగారుగా మెట్లెక్కి పైకి వెళ్ళేరు. వాళ్ళలో ఎవరూ రోజూ వచ్చేవారు కాదు. ఈ లోగా తలుపు తోసుకుంటూ పనిమనిషి వచ్చింది. వస్తూనే ఆ వార్త చెప్పింది, ఎంతో రహస్యమన్నట్లు- గొంతు తగ్గించి.

"నిజమే?- నమ్మలేనట్లు ఆశ్చర్యంగా అనిపించింది వసుంధరకి.

కాస్సేపు అలాగే ఆచేతనంగా ఉండి పోయి, ఇంకా ఏం చెపుతుందోనని ఆశ్చర్యంగా ఆమె ముఖంలోకి చూసింది.

"తెల్లారగట్టే లేచి కాఫీ కాచుకుని కూడ తాగేరటమ్మా. ఆ ఎదుటి వాటా మాణిక్యమ్మ గారు కూడ చూశారుట. కుర్చీలో కూర్చుని పేపరు కూడా చదివినారట- అంతే మారాజు- ఈయమ్మ ఏడు గంటలకు చూస్తే కుర్చీలోనే పక్కకి ఒరిగిపోయి ఉన్నారంట- పెద్దపేనం... ఎంతలో పోవాలీ..." చెప్పిందది.

వసుంధరకి ఏం అడగటానికీ నోటమాట రాలేదు- మనిషి తెలిసి కొన్ని తప్పులు చేస్తాడు- కావాలనే కొన్ని చేస్తాడు- కొన్ని తప్పులు తెలియకుండా జరిగిపోతాయి. ఎదుటి మనిషికి హాని చేసేంతగా కొన్ని రూపుదిద్దుకుంటాయి- తర్వాత పశ్చాత్తాప పడినా జరిగేదేం ఉండదు- తను తప్పు చేయపోయినా తనుచేసిన పని ఆయనను నొప్పించింది- అదే అతనిని ఈ స్థితికి తెచ్చిందా?

"ఫోన్ చేస్తే ఆ బాబు సేయితులెవరో వచ్చారు. ఊళ్ళో ఉన్న దూరపు బంధువులూ కొందరొచ్చారు"- చెబుతోంది పనిమనిషి.

ఒక్కసారి వసుంధర మనసంతా కల్లోలమై అపరాధ భావంతో నిండిపోయింది. తనీ పోర్షన్‌లో కొచ్చిన ఈ కొద్ది నెలల్లోనూ ఆయన వ్యక్తిగత జీవితం గురించి తెల్సుకున్నది లేదు. ఆయనతో మాట్లాడిందీ లేదు. కానీ తెల్సుకున్న దొక్క విషయమూ తనకు నచ్చక తన ధోరణిలో తను చేసి అతన్ని అసౌకర్యానికి గురిచేసింది- కానీ ఇంత త్వరగా పరిస్థితులిలా రూపుదిద్దుకుంటాయని ఊహించలేదు.

లేచి, డోర్ లాక్ చేసి మెట్లెక్కింది. మొదటి అంతస్తులో రెండో నెంబర్ ఫ్లాట్ ఆయనది. బాల్కనీలోనూ, పిట్టగోడ నానుకునీ వచ్చినవారు నిల్చుని ఉన్నారు. మిగిలిన ఫ్లాట్‌లలోని వారూ ఒక్కొక్కరే వచ్చి వెళుతున్నారు.

వసుంధర గుమ్మం దగ్గరకు వెళ్ళగానే అక్కడున్న వారు అడ్డు తొలిగి చోటిచ్చారు. అడుగు ముందుకు వేయబోయి ఆగి, అక్కడ్నించే లోనికి చూసింది వసుంధర. వాలు కుర్చీలోంచి క్రిందకి చేర్చేరులా ఉంది. సుఖనిద్రలో ఉన్నట్టుందాయన ముఖం.

"ఏది ఏమైనా సునాయాస మరణం" అంటున్నారెవరో.

తలెత్తి గదిలోకి దృష్టి సారించింది వసుంధర. గుమ్మాని కెదురుగా ఉన్న గోడకి

విశ్వకవి రవీంద్రుని పటం వేలాడదీసి ఉంది. అద్దాల బీరువాపైన మూడు జంటల ఫోటోలు... బహుశః ఆయన పిల్లలవి కాటోలు ఫ్రేముల్లో బిగించి ఉన్నాయి. మంచానికి కాస్త అవతల గోడకి గంధపు పూలమాలతో ఓ స్త్రీ మూర్తి ఫోటో-- కాస్త పెద్ద సైజులో ఉంది. ఆమె ఆయన శ్రీమతి అయి వుండొచ్చు.

"నిన్న సాయంకాలం కూడా పార్కులో చాలా విషయాలే మాట్లాడారు రావుగారు. మనదేశంలోని నదీజలాల వాడకం మీద, త్రాగునీటి సమస్యమీద ఆయనకు కొన్ని నిశ్చయమైన అభిప్రాయాలున్నాయి. ఆ విషయం మీద ఆయన రాసిన వ్యాసం ఈ వారం "టుడే" వీక్లీలో ప్రచురింపబడింది".

అక్కడ చేరిన కొందరితో చెపుతున్న వ్యక్తి వంక ఆశ్చర్యంగా చూసింది వసుంధర. ఆయనకూ డెబ్బయ్ ఏళ్ళు పైనే ఉంటాయి. రావుగారి చిరకాల మిత్రుడట.

"ఆయన ఏ విషయం మీదనైనా అనర్గళంగా మాట్లాడగలరనే తెలుసును గానీ ఆయనొక రచయిత అని మాకింతవరకూ తెలియదు" అన్నారెవరో.

"అదే ఆయనలోని విశిష్టత. తన గురించి చెప్పుకోడు. ఒకరి గురించి అడగడు. నన్ను మాత్రం ఆప్తమిత్రుడిగానే చూసుకునేవాడు" అని మళ్ళీ రావుగారి గురించి తనకు తెలిసినది చెప్పడం మొదలు పెట్టాడాయన మిత్రుడు.

"మనిషి తిండికోసం, డబ్బుకోసం బతక్కూడదు. ఒక ఆశయం కోసం బతకాలనే వాడాయన. చేసినది ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్లో ఆఫీసర్ పదవే అయినా ఆర్జించింది స్వల్పం. సంపాదించుకున్న జ్ఞానం అఖండం. ఆహారపు అలవాట్లలోనూ, రోజువారీ జీవితంలోనూ ఆయన కొన్ని నియమ నిబంధనలను పాటించేవాడు. పుస్తకాలు కొని చదవడం, అవసరమైన వాళ్ళకి సాయపడ్డం అతని సద్గుణాలు."

"ఏమైనా ఈ వయసులో ఇలా ఒంటరిగా ఉండడమే..." అన్నారెవరో ఆయన మాటకు అడ్డొచ్చి.

"నిజమే ఆయన తన పిల్లల దగ్గర ఉంటే బావుండేది. అయితే స్వదేశంలో స్వేచ్ఛగా జీవించే ఆనందం ఆయనకు పరదేశంలో కనిపించలేదు. ఇక్కడి ప్రజల జీవన గతుల గురించీ, ఆర్ధిక లేమి, అనారోగ్యం, అవినీతి గురించీ మనిషిగా అతను బాధపడేవాడు- రచయితగా స్పందించి వివిధ కోణాల్లో వాటి మూలాల్ని అన్వేషించడానికి ప్రయత్నించేవాడు. పర్యావరణం మీదా, నదీజలాల పరిరక్షణ మీదా ఆయన వివిధ పత్రికలలో రాసిన వ్యాసపరంపరకు మంచి గుర్తింపే వచ్చింది. సమాజంలో మార్పు రావాలంటే అది వ్యక్తిగత జీవితం నుండి రావాలనే వారాయన. తను పోతే దహన సంస్కారం కోసం కట్టెలు వాడకుండా ఎలక్ట్రిక్ క్రిమేషన్ చేయించే ఏర్పాటు చేసుకున్నాడు. తన అస్తికల్ని పొరపాటున కూడ జీవనదుల్లో కలపొద్దని కోరుకున్నాడు. మానవ అస్తికల నిమజ్జనం వల్లా, తండోపతండాలుగా

జనం నదీ స్నానాలు ఆచరించడం వల్లా మన జీవనదులు అపవిత్రమై విపరీతంగా కలుషితమైపోతున్నాయని అతని ఆవేదన- పుష్కరాది పుణ్యకాలల్లో రాజకీయంగా జరిపే కార్యక్రమాలు, ప్రచారం కారణంగా పవిత్రత కంటే అపవిత్రతే ప్రబలుతోందని వాపోయే వారాయన"

-ఇలా రావుగారి వ్యక్తిగత ఇష్టా ఇష్టాలను అభిప్రాయాలను ఒక్కొక్కటిగా చెప్పుకొచ్చారాయన.

ఇంతలో రావుగారి దగ్గిరి బంధువు లెవరో రావడం వల్ల అక్కడున్న వారిలో కొంత కదలిక వచ్చింది. పై దేశాల్లో ఉన్న ఆయన పిల్లలు వచ్చే అవకాశం లేదుట. వార్త మాత్రం అందజేయడం జరిగిందట - ఇటువంటి పరిస్థితి ఏర్పడి ఒకవేళ పిల్లలు రాలేకపోయినా తదుపరి కార్యక్రమాలను ఊహించిన రావుగారు అందుకు తగిన ఏర్పాట్లు చేసుకున్నారట.

ఆయన దూరదృష్టికి ఆశ్చర్యమనిపించింది వసుంధరకి. ఇటువంటి వ్యక్తిని తను సామాన్య వ్యక్తిగా ఊహించింది. తక్కువగా అంచనా వేసి ఆరోజు జలజాక్షి దగ్గర మాట కూడా తూలింది.

తన గదికి వచ్చిందన్న మాటే గాని వసుంధర ఆలోచనలు పలురకాలుగా పరుగులు తీస్తున్నాయి. ఆలోచన, నిబద్ధత, ముందుచూపు, స్వశక్తి మీద నమ్మకం ఉన్న రావుగారి లాంటి వారు ఈ రోజుల్లో ఎందరుంటారు?

ఆఫీసుకు ఫోన్ చేసి విషయం చెప్పి సెలవు కోసం రిక్వెస్టు చేసింది- ఆలోచనల్లోంచి బయటపడ్డానికి టీవీ ఆన్ చేస్తే ఛానల్లో ఏదో సీరియల్ వస్తోంది. ఉమ్మడి కుటుంబాల్ని విచ్ఛిన్నం చేసే ప్రయత్నమా అన్నట్లు స్త్రీ పాత్రల్ని సృష్టించి అసహజమైన మలుపులతో ఏడాదిగా సాగుతోందా సీరియల్. ఛానెల్ మార్చింది. న్యూస్ ఛానెల్లో ఏదో చర్చ సాగుతోంది.

వ్యాపారమౌతున్న విద్యావ్యవస్థ- నిరక్షరాస్యత- బాల కార్మిక సమస్య-

"చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వం ఏదైనా చేయవచ్చు. పధ్నాలుగేళ్ళ లోపు పిల్లలు కొన్ని వందల ఫేక్టరీల్లో పనిచేస్తున్నారు. విద్య నేర్పించే నెపంతో వీరిని పనుల నుంచి తొలగిస్తే చాలా ఫేక్టరీలు నష్టాల ఊబిలో కూరుకుపోతాయి. అంచేత బాలకార్మిక వ్యవస్థని నిషేధించే కంటే క్రమబద్దీకరించడం ఉత్తమం" అంటున్నారు అంతర్జాతీయ కార్మిక సంస్థలో పనిచేసే ఒక అధికారి. మరొక ఆర్థికవేత్త అభిప్రాయంలో బాలకార్మికుల వల్ల వారి కుటుంబాలకు వచ్చే ఆదాయం స్వల్పమే అయినా స్థిరమైన ఆదాయమే వస్తోంది. తల్లిదండ్రులిద్దరూ ఏ వ్యవసాయ కూలీలో అయినప్పుడు ఆ పేద కుటుంబానికి వారి పిల్లల్ని చదువు కోసం పంపడం కంటే పనిలోకి పంపించడమే అవసరమౌతుంది.

"భారతదేశం లాంటి పేద జనం ఎక్కువగా ఉన్న దేశంలో నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం సహాయ సహకారాలందించే చర్యలు చేపట్టినప్పుడు పేద పిల్లలకు కూడ ఉపాధి అవకాశాలు కల్పించాలి. అలా వారి ఆదాయం వల్ల కూడ పేదరికం కొంతమేరకైనా దూరమౌతుంది. శ్రమించడం వల్లనే బ్రతుకు వెళ్ళదీస్తున్న బాలలను గుర్తించి వారికి తగిన శిక్షణ ఇచ్చేట్లు చూడడం ప్రభుత్వ బాధ్యత."

చర్చ ముగించే వరకూ అందులో లీనమయ్యే ఆలోచించింది వసుంధర.

నిజమే! ఏ ప్రభుత్వం వచ్చినా బడికి వెళ్ళని సుమారు ఏభైవేల మంది చిన్నారులను బడికి పంపడంలో సఫలీకృతం కాలేకపోతోంది- కారణం... అటువంటి వారి జీవన మూలాల్ని తెలుసుకోలేకపోవటమే. పేద కుటుంబంలోని పిల్లలకు ఆకలికి అన్నం, తాగటానికి మంచినీరు, కట్టుకుందికి బట్ట, ఆ తర్వాతే విద్య అనే విషయాన్ని ఆలోచించకుండా చిన్న చిన్న పనులు చేసుకుని పొట్టనింపుకునే వారికి విద్యే ప్రాథమిక అవసరమంటే ఎలా? స్వతంత్రమొచ్చి ఇన్నేళ్ళయినా ప్రజల కనీసావసరాల్ని తీర్చలేని ప్రభుత్వం- అది తన ఓటమిగా అంగీకరించాలి.

చర్చ ముగిసింది. బయట అలజడికి తల తిప్పి చూసింది వసుంధర. రావలసిన రావుగారి దగ్గర బంధువులూ, తదుపరి కార్యక్రమాన్ని నిర్వర్తించే వారూ వచ్చినట్లున్నారు. పన్నెండు గంటలౌతుంటే రావుగారి భౌతిక కాయాన్ని మేడ మీంచి కిందకి చేర్చి, అప్పటికే సిద్ధం చేసిన వేన్‌లోకి ఎక్కించేరు.

అపార్ట్‌మెంట్లోని వారితో పాటు బయట జనం కూడ ఒక్కమారు ఇంటి ముందు గుమిగూడేరు.

తానూ బయటకు వచ్చి నిల్చుంది వసుంధర.

ఏడ్పులు లేవు పెడబొబ్బలు లేవు- ఎంత గొప్పగా బతికినా ఎంతమందిలో మెలిగినా చివరికి ఒంటరి ప్రయాణమే కదా అన్న వైరాగ్య సానుభూతి భావంతోనూ, నిశ్శబ్దంతోనూ నిండిపోయిందా ముంగిలి. ఏ ఆర్భాటమూ లేకుండానే రావుగారి భౌతికదేహం కనుమరుగైపోయింది.

ప్రాణం లేని కట్టె ఇంట్లో ఉన్నంతకాలం తమ తమ నిత్యకృత్యాలు నిలిపేసిన అపార్ట్‌మెంట్లోని వారంతా తిరిగి తమ తమ పనుల్లోకి వెళ్లిపోయేరు.

అంతవరకూ బిగబట్టినట్లున్న ఆకాశంలోని మేఘాలు ఒక్కమారు భూమి తడిసేట్లు జల్లులు కురిపించాయి.

లోపలికొచ్చి తలుపు వేయబోతూ బయటకు చూసిన వసుంధరకు ఆ కురిసిన

వర్షపు జల్లుకు ముద్దయి తడిసిన కాకుల్లా పరుగు పరుగున వస్తున్న వాళ్ళు కనిపించారు. ఒక్కక్షణం ఆగి పరీక్షగా చూసింది- ఆ వచ్చే ఆమెకు వయస్సెంత ఉంటుందో అంచనా వెయ్యడం కష్టం. దేశంలోని పేదరికం, దైన్యం ఆమె ముఖంలోనే మూర్తీభవించినట్లుంది. చంకలో ఓ చంటిపిల్లా, వెనుకొక పిల్లా వెంట తరిమే సమస్యల్లా ఉన్నారు. తల మీంచి కారుతున్న నీటిని తుడుచుకుంటూ చతికిలబడి గొల్లుమంది.

"ఎల్లిపోయాడమ్మ మారాజు... ఈదినబడ్డ మా బతుకుల్ని నిలబెట్టిన మారాజు... నూటికొక్కడు సాలు అటుమంటోడు. ఆ బాబు కాళ్ళకి కడసారిగా మొక్కే అదురుష్టం కూడ లేకపోయింది".

అప్పుడు చూసింది వసుంధర ఆమె వెనుకనున్న పిల్ల వైపు.

అది మంగ!

"ఈ పిల్లదాని బతుకు భారం కూడ తన మీదే ఏసుకున్నాడా బాబు. తిండీ, బట్ట, సుచీ సుబ్రం... మాలాటోళ్ళ కింకేం కావాలి తల్లీ. తనేటి తింటే బిడ్డకది పెట్టేవాడు. నాలుగు మాసాల్లోనే నవనవలాడుతూ తయారైన దానికి నా దిష్టే తగిలింది. బిడ్డ ఏం చేసిందని దానికి జీతం? పెతి నెలా ఇచ్చీవోటు నా తండ్రి. అచ్చురమంటే ఏటో తెలీని దానికి ఆ ఆ లు నేర్పించేడు. ఎవురెలాపోతే ఎవురిక్కావాలీ మాయదారి రోజుల్లో. అన్నేయంగా పోయిన నా యజమాని డబ్బుల్లో కూడ వాటా అడిగినారా గెద్దలు. ఆళ్ళని తరిమి కొట్టి నా డబ్బులు నా కిప్పించేడు తండ్రి. నా బతుక్కోదారి చూపించేడు."

ఆ మనిషి నోట దుఃఖం పొంగుతోంది! పోయిన మనిషి పట్ల గౌరవం, అభిమానం పొంగుతున్నాయి! రక్త సంబంధమే అక్కర్లేదు, మానవ సంబంధం కూడ ప్రేమాభిమానాల్ని పంచివ్వగలవనిపించింది.

ఆమె దుఃఖం పూర్తిగా చల్లారి తేరుకున్నాక వసుంధర అంది -

"రేపొకమాటు మంగను తీసుకునిరా. మాట్లాడతాను."

అర్థం కానట్టు చూసిందామె.

"రేపట్నించీ మంగ నాతోనే ఉంటుంది నాకు సాయంగా - ఆ బాబు గారిచ్చింది నేనూ ఇస్తా."

బయట మబ్బులు విడి వర్షం ఆగింది! ముంగిట్లో ఎండ పొడ పల్చగా పరుచుకుంది.

◆ ❖ ◆